# *71వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశము*

గౌరవనీయులైన పెద్దలు, సీనియర్ సిటిజన్స్, మహిళా మిత్ర సభ్యులు, విద్యావేత్తలు, విద్యార్థులు, బాలలు, నా పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులకు, నగర పౌరులు మరియు మహిళలకు 71వ స్వాతంత్ర్య దినోత్సవానికి విచ్చేసిన పెద్దలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ రోజు కేవలం ఉత్సవం జరుపుకోవడమే కాకుండా మన దేశం కోసం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమర యోధులు భారత స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉంది. తరచుగా ప్రతిరోజు మనము స్వాతంత్ర్యాన్ని పొందిన విషయాన్ని చాలా సులభంగా తీసుకుంటాము. కాని మనము గ్రహించవలసింది ఏమిటంటే మన భారత దేశానికి స్వాతంత్ర్యం కోసం చాలా రోజులు పోరాడి అనేకమంది ప్రాణాలు అర్పించి కొన్ని తరాలు తమ జీవితాలను చెఱశాలలో గడిపారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆనాటి సమరయోధులను, కొందరు మహానుభావులను మనం గుర్తుంచుకోలేదు. వాళ్ళు చేసిన త్యాగానికి ఈ రోజు మనము కృతజ్ఞతా భావంతో నమఃసుమాంజలి అర్పించుకుందాము.

ఈ రోజు మనందరికీ ఒక గొప్ప దేశంలో దేశసేవ చేయడానికి మంచి సదావకాశంగా భావించి మన భాద్యతలను, విధులను ఒక మంచి పౌరులుగా భారతమాత సంక్షేమ అభివృద్ధికి పాటుపడాలని ప్రతిజ్ఞ చేద్దాము. మన ప్రియతమ దేశంలో వెనుకబడిన వర్గాలు, దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి మనము కృషి చేద్దాము.

ఈ రోజు దేశ స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడమే కాకుండా, మనకి వారు రాజ్యాంగం, లౌకిక మరియు సామ్యవాద అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను అందించారనే విషయాన్ని మననం గుర్తుంచుకోవాలి. తద్వారా సమాజంలో అన్ని వర్గాలకు ఉపయోగపడేందుకు వృద్ధమిత్ర, మహిళా మిత్ర, బాలమిత్ర కార్యక్రమాలను ఏర్పాటు చేసుకున్నాము. అలాగే సిటిజన్ జస్టీస్, సామ్యవాద, ఆర్థిక మరియు రాజకీయ, భావస్వేచ్ఛ, సర్వమత సామరస్యం, సమానత్వం అందిస్తూ, అందరికీ అన్ని అవకాశాలను కల్పించుకుని, అందరి వ్యక్తిత్వాలను గౌరవిస్తూ మత సామరస్యంతో పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపుదిద్దుకున్నాము.

ఈ రోజు మనం ఈ వారసత్వాన్ని సంతరించుకున్నందుకు గర్వపడుతున్నాము. అలాగే ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదిగాము. రాబోయే తరాలకు కూడా గొప్ప వారసత్వాన్ని అందించిన గొప్ప మహనీయులు స్త్రీ, పురుషులకు అందరికీ శిరస్సు వంచి ఘనంగా నివాళి అర్పిద్దాము.

*(మిగతా 2వ పేజీలో ...)*

ఈ దేశంలో జన్మించినందుకు నేను చాలా గర్వపడుతున్నాను.

ఈ సందర్భంగా నేను విజయవాడ ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున ఒక మంచి పోలీసింగ్‌ను అందిస్తూ, శాంతి భద్రతలను కాపాడటం, నేరాలను నియంత్రించడం, నేరస్తులను పట్టుకోవడం ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించడానికి అన్ని విధాల కృషి చేస్తున్నాము.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ చరిత్ర సృష్టించే సమయమిది. ఇప్పుడు స్వర్ణాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిలో భాగంగా విజయవాడ రూపుదిద్దుకుంటుంది. మెరుగైన ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవనీయులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి ఖ్యాతిగాంచిన పెట్టుబడి సంస్థలను మన రాష్ట్రానికి తేవడం ద్వారా సర్వాతాభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా రూపుదిద్దుకుంటున్నందుకు మనమందరం గర్వపడాలి.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోలీస్ శాఖ తరపున విజయవాడ నగరం శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, నేర రహిత విజయవాడ నగరంగా తీర్చిదిద్దుతూ, ప్రజలతో పోలీసులు స్నేహభావంతో వ్యవహరిస్తూ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు తోడ్పాటును అందిచి సహకరించలని కోరుతున్నాను.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు శిక్షణ పొందుతూ మంచి వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకుంటూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరుగతుల వారికి, వయో వృద్దులకు, మహిళలు మరియు చిన్న పిల్లలకు చేయూతను అందించాలి.

నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో అందరూ కలసికట్టుగా అప్పగించిన గురుతరమైన భాద్యతలను నిర్వర్తించాలి. ప్రజలను చిరునవ్వుతో పలకరించి పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నగరంలో నెలకొల్పాలి. ఇందుకోసం ప్రజలను భాగస్వాములను చేసి, సమాజంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, వ్యాపారులు, ఎన్.జి.ఓ.లు, మహిళా సంఘాలు, పెద్దలు మరియు మీడియా మిత్రులతో సహా అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటూ ముందుకు వెళ్ళాలి. ఇందులో మీడియా మిత్రుల పాత్ర చాలా కీలకమైనది. ఉదాహరణకు వృద్దమిత్ర, మహిళా మిత్ర, బాలమిత్ర కార్యక్రమాలను సామాన్య ప్రజల్లోకి తీసువెళ్ళడం ద్వారా విజయవాడ పోలీస్ శాఖకు మంచి స్పందన, గుర్తింపు వచ్చింది.

*(మిగతా 3వ పేజీలో ...)*

సామాజిక మార్పులకు అనుగుణంగా మనం ప్రపంచ స్థాయి పోలీసింగ్‌ను ప్రజలకు అందించేందుకు నిరంతరం కృషి చేయాల్సి ఉంది. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ముందుకు వెళ్ళేందుకు రాష్ట్ర ప్రభుత్వం యొక్క మార్గదర్శకాలు మరియు సహాయ సహకారాలు ఎంతైనా అవసరం.

ప్రజా శాంతి భద్రతలు, ప్రజల రక్షణ కొరకు పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం కృషి చేస్తారని నేను ఈ సందర్భంగా గట్టిగా నమ్ముతున్నాను. పోలీస్ కరప్షన్‌ను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో సహించరన్న విషయం కూడా నాకు తెలుసు. మనమందరం కలసి అలాంటి పనులకు ఆస్కారం ఇవ్వకుండా ప్రజల్లో పోలీసులపై నమ్మకం, విశ్వాసం కలిగించాలి.

పోలీస్ సిబ్బంది నిత్యం అనేక వత్తిడులు, అవరాధోలను, ఛాలెంజ్‌లను ఎదుర్కొని విధి నిర్వహణలో కష్టపడుతున్నపటికీ, ప్రజల నుండి సరైన గుర్తుంపు గానీ, మర్యాద గానీ పొందలేక పోతున్నారని నాకు వ్యక్తిగతంగా తెలుసు. అయినప్పటికీ వీటన్నింటిని అధిగమించి మనం విధి నిర్వహణలో ప్రతి పౌరుడికి సేవలు అందిస్తూ ముందుకు వెళుతున్నాము.

ఇన్ని కష్టాలు, అవాంతరాలు, వత్తిడులను ఎదుర్కొంటూ, ప్రతికూల పరిస్థితుల్లో కుటుంబ జీవితాలను కూడా త్యాగం చేస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది యొక్క సంక్షేమం చూడవలసిన గురుతరమైన బాధ్యత నాపై ఉంది.

పోలీసు విధులను, సక్రమంగా, క్రమశిక్షణతో, ప్రజలను స్నేహితులుగా చూస్తు ప్రజల మన్ననలు చూరగొనాలి. మరియు ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందిస్తూ విజయవాడ నగరంలో శాతి స్థాపనకు పాటుపడాలి. రాత్రింబవళ్ళు బాలలు, పెద్దలు, మహిళలకు భద్రత మరియు రక్షణ కల్పించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, క్రొత్త చరిత్రను సృష్టిస్తున్న ఈ శుభ సమయంలో నేను ఇక్కడ ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు చాలా అదృష్టంగా భావిస్తూ, ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

*(మిగతా 4వ పేజీలో ...)*

నాపై ఉంచిన భాద్యతల ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ఆశించిన ఫలితాలు సాధించేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, పోలీసు సిబ్బంది, అధికారులు, అందరూ కలసి రాష్ట్ర అభివృద్దికి పాటుపడాలని కోరుతున్నాను.

ఈ శుభ సందర్భంగా పోలీసు సిబ్బంది, అధికారులు, అందరూ కలసి అన్ని వర్గాల ప్రజలకు ఉత్తమ సేవలను అందజేస్తూ, ప్రజల భాగస్వామ్యంతో అనుకున్న ధ్యేయాలను సాధిస్తారని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను.

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో విజయవాడలో ప్రతిష్టాత్మకంగా జరిగిన 2016 కృష్ణాపుష్కరాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసేందుకు అనేక చర్యలు తీసుకోవడంతో సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించడం ద్వారా విజయవాడ సిటీ పోలీసు అనేక మార్పులతో క్రొత్త రూపును సంతరించుకుని నగర ప్రజల నుండి మంచి స్పందన మరియు మన్ననలను అందుకోవడం జరిగింది. ఇదొక మంచి శుభ పరిణామంగా భావిస్తున్నాను.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నా ప్రియమైన విజయవాడ నగర పౌరులకు మరియు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో చేయవలసినవి, సాధించవలసిన పనులు చాలా ఉన్నాయి. ఇందుకు గాను దేశ ప్రజలకు దేవుని ఆశీర్వాదం అందించాలని కోరుకుంటూ...

**... జైహింద్ ...**